www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 1 డిసెంబర్ 2023

5

తూర్పుగోదావరి



ఎల్ఐసి సాయిబాబాకు ఘన సన్మానం

ప్రజాశక్తి-కడియం

12 ఏళ్లుగా ఎల్ఐసి రాజమహేంద్రవరం రూరల్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షునిగా కొనసాగుతున్న ఆదిమూలం సాయిబాబాను ఏజెంట్లు గురువారం ఘనంగా సన్మానించారు. రూరల్ పిడింగొయ్యిలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో సాయిబాబాను అసోసియేషన్ అధ్యక్షునిగా యూనియన్ సభ్యులు మరోమారు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎల్ఐసి రూరల్ బ్రాంచ్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా విధులు నిర్వహిస్తున్న సాయిబాబా, యూనియన్‌కు చేస్తున్న సేవలకు గుర్తింపుగా 13వ ఏడాది కూడా అధ్యక్షునిగా ఏకగ్రీవం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సాయిబాబాను పూలమాలలతో సత్కరించి సేవలకు గుర్తింపుగా జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఇరిగేషన్‌ను వేధిస్తున్న లస్కర్ల కొరత

- 120 మందితో కాలయాపన
- సాగునీటి విడుదల్లో కీలక విధులు
- రబీ సాగుపై తప్పని ప్రభావం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నీటి పారుదల శాఖలో లస్కర్ల కొరత వేధిస్తోంది. తూర్పు, మధ్య డెల్టా, హెడ్ వర్క్స్, పెద్దాపురం, ఏలేశ్వరం డివిజన్ల పరిధిలో 487 మంది లస్కర్లు అవసరం కాగా కేవలం 120 మందితో నెట్టుకొస్తున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 431 కిలోమీటర్ల ప్రధాన కాల్వలు ఉన్నాయి. మరో 2024 కిలోమీటర్ల మేర అనుసంధానమైన చిన్నకాల్వలు ఉన్నాయి. ఈ కాల్వల పరిధిలో ఉభయ గోదావరి జిల్లాల్లో 8.96 లక్షల ఎకరాల్లో ఆయకట్టుకు సాగు నీరందిస్తున్నారు. ఈ ఏడాది రబీ సాగుకు, తాగునీటి అవసరాలకు 92 టిఎంసిలు అవసరం కాగా దశలవారీగా 82 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని చెబుతున్నారు. రబీ ముందస్తు సాగు చేపట్టి జనవరి మొదటి వారం నాటికే నాట్లు పూర్తి కావాలని అధికారులు సూచిస్తున్నారు. ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా సాగు చేపట్టకపోతే చివరిదశలో పంట దెబ్బ తినే అవకాశం ఉందనే హెచ్చరిక చేస్తున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో లస్కర్ల విధులు కీలకం కానున్నాయి. సాగునీటి కాలువలకు నీటి విడుదల, గోదావరి వరదల సమయంలో క్షేత్రస్థాయిలో లస్కర్ల పనితీరు అత్యంత కీలకం. కాలువల నుంచి పిల్లకాలువలకు నీటి మళ్లించేందుకు వినియోగించే స్లూయిజ్‌లు, కల్వర్టులు, బ్యారేజికి ఉండే గేట్ల పనితీరు, షట్టర్లు, హెచ్ స్లూయిజ్‌లు వంటి మరమ్మతులు, నీటి విడుదల సమయంలో ఎంతమేరకు నీటిని సరఫరా అవసరమో ఆ మేరకు విడుదల చేస్తుంటారు. అదే విధంగా గోదావరి గట్లు ఎక్కడ ఎక్కడ బలహీనంగా ఉన్నాయి వంటి అనేక పనులు పర్యవేక్షణ లస్కర్లు నిర్వహిస్తుంటారు. రైతులకు అధికారులకు మధ్య రాత్రింబగళ్లూ అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో లస్కర్ క్రియాశీలక పాత్ర పోషిస్తారు. ప్రస్తుతం ఇరిగేషన్ శాఖలో లస్కర్ల పోస్టులు భర్తీ చేయకపోవడంతో రబీసాగుపై ప్రభావం తప్పదనే సంకేతాలు విన్పిస్తున్నాయి. వరదల సమయంలోనూ పైస్థాయిలో ఉన్న ఎఇ, డిఇ స్థాయి అధికారులకు పంట కాలువల పరిస్థితులపై ఎప్పటికప్పుడు లస్కర్లు సమాచారం అందిస్తుంటారు. లాకులు ఎత్తడం దించడం వంటి కార్యక్రమాలను అర్ధరాత్రులు సైతం అధికారుల ఆదేశాల మేరకు చేస్తుంటారు. వాస్తవానికి వీరు చేసే పని ఎక్కువ, వీరికి కేటాయించిన జీతం చాలా తక్కువే. ప్రతి ఏటా 8 నెలలు కాంట్రాక్టు పద్ధతిన ప్రభుత్వం విధుల్లోకి తీసుకుంటుంది. కేవలం రూ10,500 చొప్పున చెల్లిస్తోంది. ఈ వేతనాలు సైతం మూడు లేక ఐదు నెలలకోసారి అందజేయటం గత రెండేళ్లుగా పరిపాటిగా మారింది. అయితే విధి నిర్వహణ ఎంత కష్టమైనప్పటికీ ఏదో ఒక రోజు ప్రభుత్వం పర్మినెంట్ చేస్తుందని లస్కర్లు తమ విధులు కష్టమైనా ఇష్టంగా చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి లస్కర్ల పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని రైతులు, రైతు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆత్రేయపురం మండలం లొల్ల లోని లాకులు

120 మంది నియామకానికి అనుమతి

120 మంది లస్కర్ల నియామకానికి ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. గత ఏడాది విధులు నిర్వహించిన 120 మందిని రెన్యువల్ చేయనున్నాము. 8 నెలల కాల వ్యవధిలో లస్కర్లు విధులు నిర్వర్తిస్తుంటారు. కాల్వల నిర్వహణ, స్లూయిజ్‌ల పర్యవేక్షణలు, మరమ్మతులు తదితర సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతాము. రబీలో సాగునీటికి ఇబ్బందులు లేకుండా నీరందించేలా ప్రణాళికలు రూపొందించాము.

- కె.విశ్వేశ్వరరావు, ఇఇ ధవళేశ్వరం హెడ్ వర్క్స్.



విజయోత్సవంలో పాల్గొన్న సిఐటియు నాయకులు

'సర్వారాయ' ఎన్నికల్లో సిఐటియు ఘనవిజయం

ప్రజాశక్తి-కడియం

వేమగిరిలోని సర్వారాయ సుగర్స్ బాట్లింగ్ యూనిట్ (కోకోకోలా)లో గురువారం గుర్తింపు సంఘం ఎన్నికల్లో శ్రీసర్వారాయ సుగర్స్ లిమిటెడ్ బాట్లింగ్ యూనిట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సంఘం విజయం సాధించింది. మొత్తం ఓట్లు 141కు గాను 134 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లలో సిఐటియుకు 86, ఎఐటియుసికి 48 ఓట్లు వచ్చాయి. 38 ఓట్ల ఆధిక్యతతో ఎఐటియుసిపై సిఐటియు విజయం సాధించింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 2 గంటలు వరకు జరిగింది. అనంతరం 3.30 గంటలకు ఫలితాలు వెల్లడించారు. ఫలితాల అనంతరం జరిగిన విజయోత్సవ సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎస్ఎస్.మూర్తి మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో సిఐటియును గెలిపించిన కార్మికులకు అభినందనలు తెలిపారు. కార్మికులకు మెరుగైన వేతనఒప్పందం, ఇతర సమస్యలు పరిష్కారానికి సిఐటియు కృషి చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై అన్ని పరిశ్రమల్లోని కార్మికులను ఏకం చేసి కార్మిక సంక్షేమానికి కృషి చేస్తుందని, అదే తరుణంలో ప్రభుత్వ విధానాల వల్ల చితికి పోతున్న చిన్న మధ్య తరగతి పరిశ్రమలు రక్షణకు పోరాటాలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సుందబాబు, బి.రాజులోవ, జిల్లా కోశాధికారి కెఎస్‌వి.రామచంద్రరావు, జిల్లా కార్యదర్శులు కర్రి రామకృష్ణ, బి.పూర్ణిమరాజు, కె.బేబిరాణి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.మచ్చరావు, బి.పవన్, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పలివెల భాస్కరరావు, అల్లుమిల్లి శ్రీనివాసు, కెవివి.సత్యనారాయణ, కమిటీ సభ్యులు వైట్ల శ్రీధర్, బిఎన్ఎం.రాజు, ఎస్‌జివి.సత్యనారాయణ, వై.కోటేశ్వరరావు, సిహెచ్.మల్లేశ్వరరావు, కె.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో నమోదుకు 13 వరకూ గడువు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

'ఆడుదాం ఆంధ్ర' ప్రోగ్రామ్‌కు సంబంధిత సచివాలయల్లో డిసెంబర్ 13 వరకు పేర్లు నమోదు అవకాశం ఉందని కలెక్టర్ కె.మాధవీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సచివాలయ పరిధిలోని వాలంటీర్లు 15 ఏళ్ల నిండిన వారు క్రీడల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న వారి పేర్లు నమోదు చేయాలన్నారు. జిల్లా నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్‌లు ఆయా సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్ల ద్వారా పేర్లు నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ వంటి ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఏదైనా రెండు క్రీడా పోటీలకు మాత్రమే వారి పేర్లు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఈ క్రీడల్లో వారి పేర్లు నమోదు చేసుకునే అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రతి గేమ్‌కూ రెండు జట్లను ఎంపిక చేయవలసి ఉంటుందని, రెండు పురుషుల జట్లు, రెండు మహిళల జట్లను ఎంపిక చేయాలన్నారు. గ్రామ వార్డు సచివాలయాల్లో డిసెంబరు 15 నుంచి 20 వరకు, మండల, మున్సిపల్ స్థాయిలో డిసెంబరు 21 నుంచి జనవరి 4 వరకు, నియోజకవర్గ పరిధిలో జనవరి 5 నుంచి జనవరి 10 వరకు, జిల్లా స్థాయిలో జనవరి 11 నుండి జనవరి 21 వరకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లా స్థాయి లో గెలుపొందిన వారు, జనవరి 22 నుండి 26 వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 512 గ్రామ వార్డు సచివాలయాల్లో పురుషుల, స్త్రీల, వీక్షకుల పేర్లు నమోదు చేయాలని సూచించారు.

2.52 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

2.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. ధాన్యం సేకరణకు సంబంధించి 17,260 కూపన్లను జారీ చేశ్శామన్నారు. 11,149 మంది రైతుల నుంచి 74,894.120 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలుకు సంబంధించి 6844 ఎఫ్‌టిఒలకు గాను రూ.75 కోట్ల 19 లక్షలు రైతుల ఖాతాలలో జమ చేశామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని 17 శాతం తేమ వరకు ఆరబెట్టుకోవాల్నారు. రైతులకు అవసరమైన అన్ని వసతులూ అందుబాటులోకి తెచ్చామన్నారు.



ఆశాలకు మద్దతు తెలుపుతున్న నాయకులు

ఆశాల సమ్మెకు పలువురి మద్దతు

ప్రజాశక్తి-దేవరపల్లి


రమాదేవి కుటుంబానికి న్యాయం చేయాలని ఆశ వర్కర్లు చేపట్టిన సమ్మెకు గురువారం పలు ప్రజా సంఘాలు, జనసేన పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. పది రోజుల నుంచి ఆశ వర్కర్ల ఆందోళన చేస్తుంటే అధికార పార్టీ ప్రతినిధులు, ప్రభుత్వాధికారులు పట్టించుకోకపోవడం చాలా దారుణం అన్నారు. పౌర హక్కుల సంఘం నాయకులు ఎన్.శ్రీమన్నారాయణ, జనసేన పార్టీ నాయకులు డి.సువర్ణ రాజు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కోశాధికారి కెవి.రమణ, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర బాబులు మాట్లాడారు. ఆశ వర్కర్ల పట్ల ప్రభుత్వ వైఖరి చాలా దుర్మార్గమన్నారు. రమాదేవి కుటుంబానికి న్యాయం చేయకుండా ఆ ఉద్యోగాన్ని వేరే ఒకరికి కేటాయించడం, పది రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. రమాదేవి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ఆశా వర్కర్లు చేస్తున్న పోరాటానికి తాము అండగా ఉంటామని అన్నారు. అనంతరం దేవరపల్లి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లిక, మహర్షి, కెవి.రమణ, గ్రీష్మన్ కుమార్, పి.నాగేశ్వరరావు, మల్లి బాబు, భగత్, రత్నాజీ అచ్చమ్మ, జాజిమొగ్గల శ్రీనివాస్, చప్పటి శివ, కె.సత్తిబాబు, సుందర్ సింగ్, అంజిబాబు పాల్గొన్నారు.

నష్టాల్లో వ్యవసాయ రంగం

- ప్రభుత్వ చేతగాని తనమే కారణం
- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్
- కాకినాడ జిల్లాలో ప్రవేశించిన యువగళం

ప్రజాశక్తి - తాళ్లరేవు, ముమ్మిడివరం

రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి చేతగాని పాలన కారణంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం నష్టాల ఊభిలో కూరుకుపోతుంది టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. 213వ రోజు యువగళం పాదయాత్ర గురువారం సుంకరపాలెం క్యాంపు సైటు నుంచి ప్రారంభమైంది. లోకేష్‌ను పటవల గ్రామ రైతులు ఈ సందర్భంగా కలిశారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. నాలుగున్నరేళ్లుగా వ్యవసాయ పంటలకు మద్దతు ధర లభించట్లేదని ఆయన వద్ద వాపోయారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడారు. రైతుల ఆత్మహత్యల్లో దేశంలో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానం, కౌలు రైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీలు, పంటల బీమా పథకాలను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. అధికారంలోకి వస్తే రైతులందర్నీ ఆదుకుంటామన్నారు. అన్నదాత పథకం కింద ప్రతి రైతుకూ ఏటా రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. మధ్యాహ్నం కోరంగిలో శెట్టిబలిజ సామాజికవర్గం ప్రతినిధులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. లచ్చిపాలెం గ్రామస్తులు కలిసి సమస్యలను ఏకరువు పెట్టారు. ఇంజరం రోడ్డులో వంతెన తూరల్లో చెత్త పేరుకుపోవడం వల్ల సాగునీరు అందక 13 గ్రామాలు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై జగన్ స్పందించారు. జగన్ అండ్ కోకు అడ్డగోలు దోపిడీపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదన్నారు. కనీసం కాలువల పూడిక కూడా తీయలేని స్థితిలో ప్రభుత్వం ఉండటం శోచనీయమన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఇంజరం వంతెన నిర్మాణంతో పాటు శాశ్వత ప్రాతిపదికన తూరలు ఏర్పాటుచేస్తామన్నారు. అనంతరం బాపనాపల్లి గ్రామస్తులు ఆయన్ని కలిశారు. రహదారులు ఛిద్రంగా మారాయన్నారు. కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా ఉన్నాయని ఆయనకు తెలిపారు. ఇళ్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో పునాదుల్లోనే ఆగిపోయాయని తెలిపారు. లోకేష్ మాట్లాడుతూ గుంతల్లో రోడ్లు వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పి.మల్లవరం గ్రామస్తులు లోకేష్‌కు సమస్యలపై వినతిపత్రం అందించారు. జిఎస్‌పిసి హామీలు అమలు చేయట్లేదన్నారు. గ్రామంలో గ్రంథాలయం, 50పడకల ఆసుపత్రిని నిర్మించాలని, అంబులెన్సు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటి నిర్మాణానికి ఒఎన్‌జిసి రూ.50వేలు సాయం అందించేలా చూడాలన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఒఎన్‌జిసితో చర్చించి హామీల అమలుకు చర్యలు తీసుకుంటామని లోకేష్ వారికి తెలిపారు. పలువురు నిరుద్యోగులు ఆయన వద్ద సమస్యలు ఏకరువు పెట్టారు. రియలయన్స్, జిఎస్‌పిసి, ఒఎన్‌జిసి కంపెనీలు ఉన్నా ఇక్కడ నిరుద్యోగులకు అవకాశం కల్పించట్లేదన్నారు. లోకేష్ స్పందిస్తూ... జగన్‌కు కమీషన్లపై ఉన్న శ్రద్ధ పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనపై లేదన్నారు. చంద్రబాబు తెచ్చిన కంపెనీలను జే ట్యాక్స్ కోసం వేధించి తరిమేశాడన్నారు. లక్షలాది ఉద్యోగాలు కల్పించే ఫ్యాక్స్ కాన్, లులూ, అమర్ రాజా, జాకీ వంటి పరిశ్రమలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయన్నారు. తాము అధికారంలోకొస్తే తాళ్లరేవులోని కంపెనీలతో మాట్లాడి ఉద్యోలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిరుద్యోగులకు రూ.3వేల భృతి అందిస్తామన్నారు. ప్రతి ఏటా జాబ్ నోటిఫికేషన్ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. అలాగే ఇసుక నావ కార్మికులు, భవన నిర్మాణ రంగ కార్మికులు, వడ్రంగి మేస్త్రీలు, ఇతర చేతివృత్తుల వారి సమస్యలను ఆయన విన్నారు. తాళ్లరేవులో ఫిష్ ఆంధ్ర పేరుతో ఏర్పాటు చేసిన సర్కారు వారి చేపలు దుకాణాన్ని పరిశీలించారు. డిగ్రీలు, పీజీలు చేసిన వారిలో జగన్ చేపల దుకాణాలు, మటన్ మార్టులు పెట్టిస్తున్నాడని విమర్శించారు.



దళితుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న లోకేష్

తాళ్లరేవులో ఘన స్వాగతం

తాళ్లరేవులో నారా లోకేష్‌కు ఘన స్వాగతం లభించింది. రవి జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులతో కలిసి ఆయన కొంత దూరం పాదయాత్ర చేశారు. జార్జి పేట వై.జంక్షన్, పి.మల్లవరం జంక్షన్, జైభీమ్‌పేట వద్ద నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. హారతులు పట్టారు. తాళ్లరే సంతపేట సెంటర్లో కంచర్ల లక్ష్మోజి, మాజీ సర్పంచ్ వాసనశెట్టి శ్రీనివాస్, ఎంపిటిసి మాజీ సభ్యులు గంజా సూరిబాబు ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికారు. ఆయన వెంట టిడిపి అమలాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి గంటి హరీష్ మాథూర్, మాజీ ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు, జనసేన నాయకులు పితాని బాలకృష్ణ, కందుల దుర్గేష్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎంఎల్‌ఎ బుచ్చయ్య చౌదరి తదితరులున్నారు.

ఓటరు నమోదును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఓటరుగా నమోదు కోసం ఎన్నికల కమిషన్ ఇచ్చిన సదవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తప్పని సరిగా నమోదు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ పిలుపు ఇచ్చారు. స్వీప్ కార్యాచరణలో భాగంగా ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల, డాక్టర్ అల్లురామలింగయ్య హోమియో కళాశాల, శ్రీ కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల, ప్రియదర్శిని నర్సింగ్ కళాశాలల్లో గురువారం నిర్వహిరంచిన సమావేశాల్లో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 2024 జనవరి 1 నాటికి ఓటు హక్కు లేని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాల్సి ఉందన్నారు. అందులో భాగంగా ప్రజలలో అవగాహన కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. మరింత సమాచారం సహాయం కోసం టోల్ ఫ్రీ నంబరు1950కు డయల్ చేయవచ్చన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్

నేడు సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పెరవలి

33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌కు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్టు ఎస్‌విఆర్ స్పిన్నింగ్ మిల్స్ అధినేత వంక రాజకుమారి తెలపారు. అర ఎకరం భూమిని సబ్ స్టేషన్ నిర్మాణ నిమిత్తం విద్యుత్ శాఖకు దానం చేసినట్టు ఆమె ఆమె తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలకు లోవోల్టేజీ సమస్యతో తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతోందని చెప్పారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్ సూచనలతో భూమి ఇచ్చినట్టు చెప్పారు.

పుల్లయ్య కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-పెరవలి

అన్నవరప్పాడు మాజీ ఎంపిటిసి పిండి జయలక్ష్మి భర్త పుల్లయ్య ఇటీవల మరణించడంతో మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు గురువారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'ఎస్‌కెఆర్'లో సిసిఇ నాక్ టీమ్ విజిట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను సిసిఇ నాక్ టీమ్ గురువారం సందర్శించింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి సమక్షంలో నాక్ టీమ్ డాక్టర్ కె.విజయబాబు (ఒఎస్‌డి), డాక్టర్ టి.జాన్ కిరణ్, ఇ.వరప్రసాద్ పరిశీలిచారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ కళాశాలకు మంచి గ్రేడ్ రావడానికి కావాల్సిన అన్ని వనరులూ ఉన్నాయని, సముచిత గ్రేడ్ కాలేజీకి దక్కుతుందని తగు సూచనలు, సలహాలను ఇచ్చారు.

కార్టూ'నిజం'



చివరికి మనం.. అడ్రస్ లేకుండా పోతామేమో సార్..!!

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పోలవరం నిర్వాసిత మండలాలను అత్యాచారాలకు గురవుతున్న ప్రాంతాలుగా ప్రభుత్వం గతంలో ప్రకటించినందున ఈ మేరకు ప్రత్యేకాధికారులు సమగ్ర నివేదికలు రూపొందించాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేసారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 5న పోలవరం ప్రాజెక్టు బడ్జెట్ విషయమై ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం సమావేశం నిర్వహిస్తోందని, ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని అత్యాచారాలకు గురవుతున్న ప్రాంతంగా ప్రకటించాలని ఆదివాసీ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నాఉ. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల మేరకు 2001లో అప్పటి ప్రభుత్వం జిఒ ఎంఎస్ నెంబరు 116 జారీ చేసిందని తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా, ఖమ్మం జిల్లాలు అధికంగా అత్యాచారాలకు గురవుతున్న జిల్లాలుగా అప్పటి ప్రభుత్వం ప్రకటించిందని, ఖమ్మం జిల్లా నుంచి 7 మండలాలు పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో ఉన్నాయని తెలిపారు. ఇక్కడ భూసేకరణాధికారులే చట్టాలను ఉల్లంఘిస్తున్నారని, కోర్టులకు తప్పుడు నివేదికలు సమర్పిస్తూ కొత్త భూసేకరణ చట్టాన్ని, పీసా చట్టాన్ని, ఎస్‌సి, ఎస్‌టటి చట్టాన్ని అధికారులే ఉల్లంఘించి నేరాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సేకరించిన భూమికి తగిన నష్టపరిహారం చెల్లించకపోయినా, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ తక్కువ చెల్లించినా, క్రొత్త భూసేకరణ చట్టంలో చెప్పిన విధంగా నిర్వాసితులకు న్యాయం చేయకపోయినా అధికారులు అట్రాసిటీ చట్ట ప్రకారం నేరస్తులవుతారన్నారు. ఈ సమావేశంలో అరగంటి వీరభద్రారెడ్డి, మడకం బంగారుబాబు, యలగడ నాగేశ్వరరావు, మద్దిపాటి సతీష్, ఎం.రత్నరాజు, సోనియా, కె.రఘుపతి, ఎం.పోసమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పలు భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని ముక్కామలలో పంచాయతీ పరిధిలో సచివాలయం 1, 2 విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనాలను ఎంఎల్‌ఎ జి.శ్రీనివాస నాయుడు గురువారం ప్రారంభించారు. అనంతరం రైతులకు గోదావరి లంక భూముల సి క్లాస్ పట్టాలను సుమారు 234 పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేతా త్రిమూర్తులు, మండల అధ్యక్షుడు కె.సీతారాం ప్రసాద్, వైస్ ఎంపిపి వేంద్ర శ్రీను, వైసిపి మండల అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ, ఎంపిటిసి గండేపల్లి రామకృష్ణ, సొసైటీ అధ్యక్షులు రేలంగి ఏసు, విద్యా కమిటీ చైర్మన్ అరిగెల నాగరాజు, గ్రామ వైసిపి అధ్యక్షుడు అరిగెల శ్రీను, ఎస్‌సి సెల్ నాయకులు చీపుర్ల సుందరరావు, ముప్పిడి సంసాను, బిసి సెల్ నాయకులు వీరమల్ల శ్రీను, సింగపూర్ రాజు, నడిపల్లి సర్పంచ్ బీర సత్యవేణి రాజు, గ్రామ కార్యదర్శి విజయ్ కుమార్, విఆర్‌ఒలు బొట్టు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఆర్ఐ పావని, ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి మేరీ కిరణ్, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ఎంఎల్‌ఎ

విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

ప్రజాశక్తి-కడియం

పాఠశాలల్లో పిల్లల విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎంఇఒ వి.లజపతిరాయ్ అన్నారు. గురువారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి డి.గౌరీశంకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత విద్యాశాఖ అమలు చేస్తున్న టిఎఆర్ఎల్, ఎఫ్ఎల్ఎన్, టిఇఎఫ్ఎల్, ఐఎఫ్ఇఎస్ఇ, లెర్న్ ఎ వర్డ్ వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమాలపై ఉపాధ్యాయులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఉపాధ్యాయులు టీచింగ్ ప్రమాణాలు ఒకరికొకరు పంచుకోవడం ద్వారా, పాఠశాలలో విద్యాభివృద్ధి జరుగుతుందని, ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమలో హెచ్ఎం ఎన్‌పికె.విశ్వనాథ్, కాంప్లెక్స్ సెక్రటరీ ఎం.లక్ష్మణరావు, డిఆర్‌పిలు అనిత, శ్రీనివాస్, ఆనంద్, అబ్బాయి, విజయ, ఎస్.శ్రీనివాస్, సిఆర్‌పిలు వీరాజు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌరీ శంకర్

పంట నష్టం నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ పంటలు దెబ్బతినకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులను అప్రమత్తం చేయాలని జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో గురువారం జడ్‌పి ఏడు స్థాయి సంఘాల సమావేశాలు ఆయా సంఘాల ఛైర్‌పర్సన్ల అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాలలో సభ్యులైన జడ్‌పిటిసి సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, జిల్లా అధికారులు, అయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశాలలో పలు అంశాలను చర్చించి ఆమోదించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల వివిధ అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించి ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, రహదారులు, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, జగనన్న స్వచ్ఛ సంకల్పం, జాతీయ ఉపాధి హామీ పథకం, హౌసింగ్, విద్యుత్, గ్రామీణ అభివద్ధి తదితర అంశాలలో ఇప్పటివరకు జరిగిన పురోగతి, కొత్తగా ప్రతిపాదించిన పనుల వివరాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జడ్‌పి ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ తుపాన్ కారణంగా పంటలు దెబ్బ తినకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు అప్రమత్తతతో వ్యవహరించి గ్రామ స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులు, పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్యా, సంక్షేమం తదితర అంశాలపై చర్చించి, సభ్యులు తీర్మానాలు చేశారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యహరిస్తూ అభివద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలుచేయనున్నట్లు వేణుగోపాలరావు తెలిపారు. ఈ సమావేశంలో జడ్‌పి సిఇఒ ఎ.రమణారెడ్డి, ఆయా జిల్లాల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు


రెస్టారెంట్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పలు రెస్టారెంట్లపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

రెస్టారెంట్లలో వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని రీజనల్ విజిలెన్స్ ఇన్‌ఛార్జి ఎస్‌పి ఎ.సురేష్ బాబు హెచ్చరించారు. గురువారం రాజమహేంద్రవరంలో పలు రెస్టారెంట్లపై విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. జెఎన్ రోడ్డులోని ఐరన్ హిల్ బార్ అండ్ రెస్టారెంట్‌లో సిగెరెట్లు అధిక ధరలకు అమ్మినందుకు, ప్రామాణికం కానీ మెజర్స్ జార్‌లు కలిగి ఉన్నందుకు కేసులు నమోదు చేశామన్నారు. టి.నగర్ లోని కుమారి థియేటర్ సమీపంలోని నెల్లూరు మెస్‌లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను గుర్తించామని, హోటల్‌ను లైసెన్స్ లేకుండా నడుపుతున్నందున నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఎవి.అప్పారావు రోడ్డులోని శ్రీకృష్ణ కల్యాణి ది వెన్యూ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు. రెస్టారెంట్లు, బార్ల పరిసరాలు, కిచెన్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి ముత్యాల నాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, నాగ వెంకటరాజు, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, ఎస్‌ఐ జగన్నాథరెడ్డి, హెచ్‌సి జీవానందం, కానిస్టేబుల్స్ వలీ, లోవకుమార్, కిషోర్, వీరబాబు పాల్గొన్నారు.

బోటు బోల్తా : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఉప్పాడ సముద్రం అలలు ఉధృతంగా ఉండడంతో రామన్నపాలెం తీరం వద్ద నిర్మిస్తున్న హార్బర్ వద్ద రాకాతి గంగరాజు అనే మత్స్యకారుడు బోటు హార్బర్ రాళ్లకు ఢీకొని ధ్వంసం అయింది. మత్స్యకారులు తెలిపిన వివరాలు ప్రకారం.. గురువారం ఉదయం వేటకు వెళ్లి అమీనాబాద్ రేవుకు వస్తుండగా అలలు ఉధృతంగా ఉండడంతో ఆర్బర్‌కు వేసిన రాళ్లను ఢీకొట్టడంతో బోటు ధ్వంసం అయింది. ఈ ప్రమాదంలో బోటు ధ్వంసం కాగా బోటులో ఉన్న మత్స్య సంపద సముద్రంలో కలిసిపోయింది. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల వరకూ నష్టం జరిగిందని, బోటులో నలుగురు మత్స్యకారులు గాయపడినట్లు స్థానికులు తెలిపారు. హార్బర్ నిర్మాణం కొరకు చేపడుతున్న పనుల వల్లే నిత్యం బోట్లు ప్రమాదాలకు గురవుతున్నాయని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామ శివారున బుధవారం అర్ధరాత్రి లారీ డ్రైవర్ గుండె పోటుతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఎన్‌టిఆర్ జిల్లా కోడూరు మండలం, కుంటముక్కల గ్రామానికి చెందిన సాహూ గోపి(55) విజయనగరం టైల్స్ లోడ్‌తో వెళ్తుండగా జెడ్ రాగంపేట శివారుకు వచ్చేసరికి, గుండెనొప్పి వస్తుంది అని లారీ పక్కకు తీసి కూలిపోయాడు. వెంటనే క్లీనర్ మరొక డ్రైవర్ దగ్గర్లో ఉన్న ఆదిత్య ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. దీంతో మృతదేహాన్ని లారీలోనే ఉంచి బంధువులకు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించినట్లు రోడ్డు సేఫ్టీ డ్రైవర్ సతీష్ తెలిపారు.

తాడిపర్రు ఘటనలో 200 మందిపై కేసులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో 144 సెక్షన్ ఉల్లంఘించి, రోడ్డును దిగ్బంధించిన రెండు సామాజిక తరగతులకు చెందిన 200 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.రామారావు తెలిపారు. వీరిలో ఒక గ్రూపునకు చెందిన 100 మంది మహిళలు, పురుషులపై. మరో గ్రూపునకుప చెందిన 100 మంది మహిళలు, పురుషలపై పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఇటీవల తాడిపర్రులో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఒక విగ్రహం విషయమై చట్ట ప్రకారమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ, రెండు గ్రుపులకు చెందిన వారు నిబంధలను ఉల్లంఘించి, రోడ్లను దిగ్బంధించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించారని తెలిపారు. ఎవరైనా చట్టానికి లోబడి ఉండాలని, చట్టాన్ని అతిక్రమిస్తే తగిన శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున నలుగురు లేదా అంతకన్నా ఎక్కువమంది గుమిగూడినా, రోడ్లపైకి చేరినా, కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కొవ్వూరు ఆర్‌డిఒ కోర్టులోని 107 సెక్షన్‌నుఉల్లంఘించినందుకు కూడా తగిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే పోలీసులకు తెలియజేయాలని, ఎవరూ చట్టాన్ని చేతిలోకి తీసుకోరాదని ఆయన సూచించారు.

186 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండలంలోని పల్లంకుర్రు పంచాయతీ శివారు మొల్లేటి మొగ కొత్తపాలెంలో గురువారం ముమ్మిడివరం ఎస్‌ఇబి ఎస్‌ఐ సిహెచ్.రాజేష్, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 186 ఎన్‌డిపిఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సంగాని సూరిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు. అక్రమ మద్యం కలిగి ఉన్నా, అమ్మినా కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఒక నెలలో రూ.1.40 లక్షల జరిమానా

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక నెల లో రూ.1.40 లక్షల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ నాగార్జున రాజు తెలిపారు. నవంబర్ నెలకు సంబంధించి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో మద్యం సేవించి వాహనం నడిపిన 15 మందిను పెద్దాపురం కోర్టు లో హాజరు పర్చగా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు. ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



అధికారులు సీజ్ చేసిన బార్ అండ్ రెస్టారెంట్

సామర్లకోటలో బార్ సీజ్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న అశ్విని బార్‌ను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసి తాళం వేశారు. బార్ నిర్వాహకులు అనుమతి తీసుకోకుండా బార్ నిర్వహిస్తున్నారని వచ్చిన ఫిర్యాదులతో అక్టోబర్ 22న శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్ నిర్వహించిన దాడులు చేశారు. ఈ నేపథ్యంలో అనుమతి లేకుండా బార్ నిర్వహిస్తుండటంతో రూ.11 లక్షలు జరిమానా చెల్లించాలని ఇటీవల సామర్లకోట ఐఎంఎల్ డిపో మేనేజర్ ఎస్‌కెడివి.ప్రసాద్ రావు బార్ నిర్వాహకులకు నోటీస్ ఇచ్చారు. ఆ నోటీసును పట్టించుకోకపోవడంతో బుధవారం రాత్రి ఎక్సైజ్ అధికారులు బార్‌కు తాళాలు వేసి సీజ్ చేశారు. గురువారం సాయంత్రం ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

సారా కేసులో ముద్దాయికి రూ.30 వేలు జరిమానా

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పలు సారాయి కేసుల్లో ముద్దాయిగా ఉన్న సామార్లకోటకు చెందిన గుబ్బల చిన్నికి రూ.30 వేలు జరిమానా వసూలు చేసినట్లు కాకినాడ నార్త్ స్టేషన్ ఎసిబి ఇన్‌స్పెక్టర్ కె.రామ్ మోహన్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. అనేకమార్లు సారాయి కేసుల్లో పట్టుబడిన ఆమెను బైండోవర్ చేసినా ప్రవర్తనలో మార్పు లేదన్నారు. దీంతో ఆమె నుంచి రూ.30 వేలు జరిమానాను వసూలు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - శంఖవరం

మండలంలోని కత్తిపూడి జాతీయ రహదారిపై గురువారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో 5గురు తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కత్తిపూడి నుంచి ఎవి నగరం వెళ్ళుచున్న ప్రయాణికుల ఆటో స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో విశాఖపట్నం వెళ్తున్న లారీ ఆటోను తప్పించే క్రమంలో ఢీకొట్టింది. ఈ ఆటోలో ప్రయాణిస్తున్న గంపల చంద్రరావు (65) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన క్షతగాత్రులు ఆరుగురిని అంబులెన్స్ వాహనంలో తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా, ఆసుపత్రి వద్ద పరిస్థితి విషమించడంతో దోని కాశమ్మ (65) మృతి చెందింది. ఎస్‌ఐ ఆర్‌విఎస్.మూర్తి ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రోడ్డు చెంతన క్లినిక్ వ్యర్థాలు

ప్రజాశక్తి-కడియం

మండల కేంద్రమైన కడియం పంచాయతీ వీధిలో రోడ్డు చెంతన క్లినిక్ వ్యర్థాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. స్థానికంగా ఉన్న ఒక మెడికల్ షాప్ నిర్వాహకులు చెంతనేః క్లినిక్ కూడా నిర్వహిస్తున్నారు. వైద్యం నిమిత్తం వచ్చే ప్రజలు, పేషెంట్లకు వాడిన సూదులు, సిరంజిలు తదితర క్లినిక్ వ్యర్థాలు రోడ్డు చెంతన పడేయడంతో ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే ఎస్‌సి బాలికల హాస్టల్ కూడా ఉందని, అధిక సంఖ్యలో ప్రజలు ఈ వీధి గుండా నిత్యం రాకపోకలు కొనసాగిస్తారని చెప్పారు. కొన్ని సందర్భాల్లో వ్యర్థాలు రోడ్డు మీదకు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం


పథకాల పట్టికను ప్రదర్శిస్తున్న నాయకులు

కుల మతాలు, పార్టీ భేదాలు చూడకుండా రాష్ట్రంలో అర్హులందరికీ సిఎం వైఎస్.జగన్ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్టు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు చెప్పారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రికి మద్దతుగా నిలిచి, ప్రభుత్వంపై అనవసరపు విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలకు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి ఇదే ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, సర్పంచ్ మెండే వెంకటరావు, కఠారి సిద్ధార్థ రాజు, సుధాకర్, వైస్ ఎంపిపి నరహరశెట్టి సరోజ, గాడి కిషోర్, కరెళ్ల శ్రీనివాసు, చోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంఇఒకు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-చాగల్లు

సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, సమస్యలు పరిష్కారించాలని కోరుతూ సమగ్ర శిక్షణా ప్రాజెక్టులో పని చేస్తున్న సిబ్బంది గురువారం ఎంఇఒ వి.ఖాదర్ బాబుకు సమ్మె నోటీసును అందజేశారు. ప్రాజెక్టులో పని చేస్తున్నామన్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సమానపనికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్ గీతా భవాని రాజేష్ పాల్గొన్నారు.

గ్రామస్తులు సుహృద్భావంతో మెలగాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామ ప్రజలు సుహృద్భావంతో మెలగాలని తాడిపర్రు ఆర్‌డిఒ ఆర్‌కె.నాయక్ సూచించారు. నాలుగు రోజులుగా మండలంలోని తాడిపర్రులో నెలకొన్న విగ్రహ ప్రతిష్ట వివాదం ఇరు వర్గాల మధ్య ఘర్షణలకు దారి తీసిన నేపథ్యంలో ఇరు వర్గాలకు మధ్య సయోధ్య కుదిరిచ్చేందుకు తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడారు. ఆర్‌డిఒ సమక్షంలో పీస్ కమిటీ సభ్యులు, శాంతియుతంగా ఉంటామని తెలిపారు. దీంతో నాలుగు రోజుల ఘర్షణకు తెరపడింది. ఈ కార్యక్రమంలో కొవ్వూరు డిఎస్‌పి విఎస్ఎన్.వర్మ, నిడదవోలు సి ఐ కె.వెంకటేశ్వరరావు, తహశీల్దారు జి.కనకరాజు, ఎంపిడిఒ జివిఎస్‌ఆర్‌కె.రాజు, ఉండ్రాజవరం, నిడదవోలు, నిడదవోలు రూరల్, పెరవలి ఎస్‌ఐలు కె.రామారావు, పి.నాగరాజు, షేక్ సుభాని, ఎం.సూర్య భగవాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

స్థానిక విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొచ్చర్ల ప్రసాద్, సుబ్బలక్ష్మి దంపతులు, చేనాపతి సత్యనారాయణ, రామలక్ష్మీ దంపతులు పీటలపై కూర్చోగా కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని వేదమంత్రాలు, వాయిద్యాల మధ్య నిర్వహించారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంతత

ప్రజాశక్తి - కాజులూరు

మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదం చేస్తాయని మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు వరద శేషారావు అన్నారు. ద్రాక్షారామ భీమేశ్వర స్వామి అష్టదిక్కులలో ఉన్న అష్ట సోమేశ్వరాయలయల్లో తూర్పున కోలంక గ్రామంలో వెలసిన ఉమా సోమేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు వి.వెంకట నాగేశ్వరరావు, వి.వెంకటరమణమూర్తి, వి.వెంకన్న, వి.రామలక్ష్మి భవాని, వి. చిన్నమాంబ, బి.నారాయణ, పి. సూర్యనారాయణ, బి.చంద్రశేఖర్త పాల్గొన్నారు.

సత్యదేవ నర్సరీని సందర్శించి పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-కడియం

టిడిపి యువనేత పరిటాల శ్రీరామ్ గురువారం కడియపులంక సత్యదేవ నర్సరీని సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా చంటియ్య శ్రీరామ్‌కు ఘన స్వాగతం పలికారు. నర్సరీలో ఉన్న వివిధ రకాల మొక్కలు, వాటి విశిష్టత గురించి వివరించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ సత్యదేవ నర్సరీ ఎంతో అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. దేశ విదేశీ మొక్కలు ఇక్కడ కనువిందు చేస్తున్నాయన్నారు. ఆయన వెంట కొరపాటి చౌదరి, మెర్ల కృష్ణమూర్తి, చెక్కపల్లి పుల్లయ్య, మెర్లరాజు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

టిడిపి రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో గురువారం సాగునీటి ప్రాజెక్టులను సందర్శించారు. పురుషోత్తపట్నంలో తొర్రిగడ్డ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలు, పోలవరం ఇరిగేషన్ ప్రోజెక్టుల పనితీరును, నియోజకవర్గంలో ఉన్న ఆయకట్టు పొలాలకు అందుతున్న సాగునీటి వివరాలు స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై చర్చ

ప్రజాశక్తి - సీతానగరం

మిర్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30 మంది వ్యాయామ ఉపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం త్రినాథరావు హాజరయ్యారు. ఈ సమావేశంలో పాఠశాల అసెంబ్లీ మొదలై అక్టోబర్ నెల కాంప్లెక్స్ మిటింగ్ మినిట్స్ గురించి చర్చించారు. ఫిట్ ఇండియా వీక్ 2023 గురించి మరియు డిసెంబర్ నెలలో జరుగబోయే అడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, షటిల్ బాడ్మింటన్, ఖో-ఖో, క్రికెట్ ఆటల గరించి చర్చించారు. మూడు మండలాల కో ఆర్డినేటర్లు సుబ్బలక్ష్మి, సింహాద్రి, చల్లాయమ్మ, కోరుకొండ జోన్ అధ్యక్షుడు ప్రసాద్, తూర్పు గోదావరి జిల్లా ట్రెజరర్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి కాకినాడ విద్యార్థి

ప్రజాశక్తి - కాకినాడ

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు కాకినాడ విద్యార్థి ఎంపికయ్యాడు. నవంబర్ 29, 30 తేదీలలో గుంటూరు జిల్లాలోని కెఎల్ యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో గోడారిగుంట మథర్ థెరిస్సా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.బిందు రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది.

'యువగళం' యాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నియోజకవర్గంలోకి ప్రవేశిస్తున్న యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంత లక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం వలసపాకలలోని తమ నివాసం వద్ద టీడీపీ నాయకులతో కలిసి వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం కరప మండలం గురజనాపల్లి వద్ద ప్రవేశించనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు సర్పవరం జంక్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభలో నాయకులు, కార్యకర్తలు, భారీ ఎత్తున ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కాళ్ళ శ్రీను, పిల్లి విజయ్ గోపాల్, పెంకె వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-చాగల్లు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని హోమ్ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. మల్లవరంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వనిత పాల్గొన్నారు. సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవడానికి ఏ ఇంటికి వెళ్లినా ప్రజల్లో సంతోషమే కనపడుతోందన్నారు. మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. ఒక్కో కుటుంబానికీ రూ.లక్ష నుంచి రూ.పది లక్షల వరకూ సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరుతోందన్నారు. ప్రజలకు మంచి చేయాలి, రాష్ట్రం ప్రగతి పథంలో నడవాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి వచ్చే చిన్న చిన్న సమస్యలను కూడా అధికారులు వెంటనే పరిష్కరించాలని మంత్రి వనిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఉపాధ్యక్షురాలు పోసిన శ్రీలేఖ, సూర్యప్రకాశం, ఎల్.రామకృష్ణ, ఎంపిడిఒ రాంప్రసాద్, తహశీల్దారు కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-గోకవరం

ఇటీవల మరణించిన ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన కొడమంచిలి నాగేశ్వరరావు కుటుంబానికి టిడిపి నాయకులు గురువారం ఆర్థిక సాయం చేశారు. పంచాయతీలో పారిశుధ్య కార్మికునిగా పని చేస్తూ నాగేశ్వరరావు అనారోగ్యంతో మరణించారు. టిడిపి నాయకులు లంక హరిబాబు ఆధ్వర్యంలో నాగేశ్వరరావు కుటుంబానికి వంట సామాగ్రి, బియ్యం ప్యాకెట్, వంటనూనె, కూరగాయలు, కిరాణా సామాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి పాలూరు బోసుబాబు, ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షుడు ఈది అశోక్, గుండా శివ ప్రసాద్, మోర్త చిట్టిబాబు, మండిగ బాలాజీ, పాలడి శ్రీను, స్టూడియో రాజ్, కొంగరపు రాజు, లంక పోసిబాబు, సిద్ద సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీచక్ర కార్మికులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నల్లజర్ల

సేవాభావంతో పని చేస్తున్న నల్లజర్ల వైద్య సిబ్బంది ఆవుపాడు గ్రామంలో శ్రీచక్ర మిల్క్ డైరీ కార్మికులకు గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు,యాజమాన్యం అభ్యర్థన మేరకు దాదాపు వందమంది ఉద్యోగులకు వైద్య ఆరోగ్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సాయంత్రం సమయంలోనూ, ఆదివారం సైతం జగనన్న ఆరోగ్య సురక్ష వంటి ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంలోనూ నల్లజర్ల వైద్య ఉద్యోగులు ఎప్పుడూ ముందుంటారని వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీవివి.ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తెల్లం గంగాధర్ రావు, డాక్టర్ మహమ్మద్ సిరాజ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాదరావు, శ్రీ చక్ర యాజమాన్యం డైరెక్టర్ కోనేరు వెంకటప్పయ్య, జిఎం ఎం.రామిరెడ్డి, కంపెనీ ప్రతినిధి పి.సాయి చరణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణంలోని 12వ సచివాలయం పరిధిలో వ్యాపారపుంత, చింతల దొడ్డి ప్రాంతాల్లో సిమెంట్ డ్రయిన్ నిర్మాణానికి గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన వారు మాట్లాడారు. వార్డు కౌన్సిలర్ ముప్పన శ్యామలాంబ, మున్సిపల్ కమిషనర్ జె సురేంద్ర, డిఇఇ ఆదినారాయణ రావు, గోకేడ అప్పారావు, కె.కామేశ్వరరావు, సొసైటీ ప్రెసిడెంట్ ముప్పన వీరరాజు, కో ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ పాల్గొన్నారు.

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - సీతానగరం

గురువారం సింగవరం నాగరత్నం కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా పాల్గొన్నారు. మట్ట శ్రీను ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ రాజా పార్టీ కండువా కప్పి జనసేన పార్టీకి చెందిన 20 మంది యువకులు వైసిపిలో చేశ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ గంటా శ్రీను, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మద్దాల కొండలరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - సీతానగరం

ముగ్గళ్ల వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుళ్ల దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులను గురువారం రాజానగరం ఎంఎలఎ జక్కంపూడి రాజా పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్ రాజా మాట్లాడుతూ దుర్గా ప్రసాద్ మరణం ఎంతో కలచివేసిందన్నారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కుటుంబ సభ్యులకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు.

జాబిల్లి వీక్షణంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్‌లో గురువారం విద్యార్థులకు జాబిల్లి వీక్షణంపై ప్రయోగాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రుడికి, భూమికి మధ్య దూరం, భూమి చుట్టూ చంద్రుడు తిరగడం వల్ల కలిగే ఉపయోగాలు, చంద్రునిపై పడిన కాంతి పరావర్తనం ద్వారా భూమికి చేరడం, చేరడానికి పట్టే సమయం, చంద్రయాన్ 3 దక్షిణ ధ్రువం మీద దిగడానికి గల కారణం, చంద్రగ్రహణం, సూర్యగ్రహణంలపై ప్రజల్లో ఉన్న అపోహలు వంటి అంశాలపై సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించారు.